క్లుప్తంగా

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పెద్దవంగర: ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు డిపో మేనేజర్ పరిమళ అన్నారు. గురువారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో 'ప్రజల వద్దకు ఆర్టీసీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బస్సు సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, హైదరాబాద్‌కు గ్రామం మీదుగా వెళ్లేలా చొరవ తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ దుంపల జమున సమ్మయ్య ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఏడీసీ బీఎన్ చారి, సీఆర్‌సీ సత్తయ్య పాల్గొన్నారు.

వెయింగ్ మిషన్ల అందజేత



తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, చిన్న పిల్లలు, అన్నివర్గాల ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ఉండాలని సర్పంచ్ మెత్కూరి రవీంద్రాచారి, ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఇందిరమ్మ కోరారు. మండలంలోని గుర్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వెయింగ్ మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేరుగు మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌసియా, కార్యదర్శి నరేష్, చైల్డ్ వెల్ఫేర్ ప్రతినిధి వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్స్ విజయలక్ష్మి, మల్లికాంబ పాల్గొన్నారు.

వెయింగ్ మిషన్ల బహూకరణ

గూడూరు: మండలంలోని మచ్చర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ సొంత ఖర్చులతో గురువారం వెయింగ్ మిషన్లు బహూకరించాడు. కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, జిల్లా నాయకులు మేరెడ్డి సురేందర్, మల్లయ్యగౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

గార్ల: ప్రతీ ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకొని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్‌బీఎం కోఆర్డినేటర్ శ్రావణ్ సూచించారు. గురువారం స్థానిక రైతువేదిక భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు 3రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమంను ఎంపీపీ శివాజీచౌహాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, లావణ్య, గంగావత్ కుంతి, ఎంపీడీఓ రవీందర్, డీఆర్‌డీపీ అబ్జర్వర్ ఆదం, ఎంపీఓ రజిని, ఏపీఓ సజన్ పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమదూరు గ్రామంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్ కోరారు. గురువారం మండలంలోని నాంచారీ మదూరులోని డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీని సందర్శించారు. కాలనీలో తాగునీరు, కరెంట్ వంటి సదుపాయాలు లేకపోవడం సరికాదని, వెంటనే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి సమస్యలన్నింటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉషారాణి, నాయకులు ఉపాకర్‌రెడ్డి, వెంకటరమణ, కుమారస్వామి, సోమన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు నీటిని వృథా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకుడు రామగిరి భిక్షం మాట్లాడుతూ.. ఇరిగేషన్ అధికారులు చేపల కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై చెరువులో నుంచి నీటిని వృథాగా విడుదల చేస్తున్నార న్నారు. ఇప్పటికైనా చెరువులో నుంచి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తుడుం వీరభద్రం, బుచ్చయ్య, యుగంధర్, మహేష్‌రెడ్డి, విశ్వనాథం, క్రిష్ణ పాల్గొన్నారు.

టికెట్ల ఇక్కట్లు..

- సకాలంలో అందక రైల్వే ప్రయాణికుల ఇబ్బందులు

డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్ ఆవరణలోని టికెట్ బుకింగ్ కార్యాలయంలో సకాలంలో టికెట్లు అందక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం సమయంలో ఎక్కువ రైళ్లు ఉండటంతో బుకింగ్ కార్యాలయంలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. నెల రోజులుగా మహారాష్ట్ర కూలీలు వారి సొంత గ్రామాలకు వెళ్తుండటంతో కూలీలతో స్టేషన్ ఆవరణ కిటకిటలాడుతుంది. స్థానిక ప్రయాణికులతోపాటు మహారాష్ట్ర కూలీలు ప్రతీ రోజు ఉదయం వేళ వరంగల్ వైపు వెళ్లే రైళ్లలో ప్రయాణిస్తుండటంతో రైళ్లతోపాటు బుకింగ్ కార్యాలయం రద్దీ ఉంటుంది. ఉదయం కొత్తగూడెం నుంచి వచ్చే కాకతీయ, సింగరేణి రైళ్లలో డోర్నకల్ నుంచి ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. స్థానిక బుకింగ్ కార్యాలయంలో ఉదయం వేళ ఒకే కౌంటర్ తెరిచి ఉండటం, ఒకే ఉద్యోగి విధులు నిర్వహిస్తుండటం, చిల్లర సమస్యతో టికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రైళ్లు ప్లాట్‌ఫారాలపైకి వచ్చిన సమయంలోనూ ప్రయాణికులకు టికెట్లు అందకపోవడంతో వారంతా ఉరుకులు, పరుగులతో రైళ్లెక్కుతున్నారు. కొత్తగూడెం వైపు నుంచి వచ్చే రెండు రైళ్లు మూడు, నాలుగు ప్లాట్‌ఫారాలపైకి వస్తుండటంతో ప్రయాణికులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా ఆ ప్లాట్‌ఫారాలకు చేరేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మూతబడిన ఏటీవీఎం మిషన్లు

బుకింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు ఏటీవీఎం మిషన్లు వివిధ కారణాలతో మూతబడి ఉన్నాయి. దీంతో ప్రయాణికులంతా తప్పనిసరిగా బుకింగ్ కౌంటర్‌లోనే టికెట్‌ను కొనుగోలు చేయాల్సి పరిస్థితి రావడం, ఒకే కౌంటర్, ఒకే ఉద్యోగి, చిల్లర సమస్య వల్ల టికెట్లు సకాలంలో అందక ప్రయాణికులు మూడు, నాల్గో నంబర్ ప్లాట్‌ఫారాలలోని రైళ్లను అందుకోలేకపోతున్నారు. ఉదయం సమయంలోనూ శాతవాహన, గోల్కొండ, పుష్‌పుల్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లు కొద్ది సమయం తేడాతో డోర్నకల్‌కు చేరుతుండటంతో టికెట్ బుకింగ్ కౌంటర్ రద్దీగా ఉంటోంది. సాయింత్రం వేళల్లోనూ బుకింగ్‌లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారులు స్పందించి బుకింగ్ కార్యాలయంలోని రెండు ఏటీవీఎంలను అందుబాటులోకి తేవాలని, రద్దీ సమయంలో అదనపు కౌంటర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బుకింగ్ కార్యాలయం వద్ద ప్రయాణికుల రద్దీ

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష నిర్వహించిన పరీక్షలో ప్రశ్నపత్రం లీకేజీకి కారణమైన టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కేలోతు సాయికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కోర్టు సెంటర్‌లో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. పేపర్ లీకేజీలో పెద్దల హస్తం ఉందని, కింది స్థాయి ఉద్యోగులను బలి చేసి పెద్దలు తప్పించుకోవాలని చూస్తున్నారన్నారు. డివిజన్ కార్యదర్శి సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. కమిషన్ చైర్మన్ 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న జనార్దన్ రెడ్డిని సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు సింహాద్రి, పట్టణ నాయకులు ఉపేందర్, రాకేష్, నితిన్, వినోద్, నవీన్, బబ్బులు, అఖిల్, మహేష్ తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న సంఘం నాయకులు

సభను విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో నేడు(శుక్రవారం) జరుగనున్న యాత్ర, బహిరంగసభ స్థల ఏర్పాట్లను గురువారం పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు సీపీఎం ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, నాయకులు రాజమౌళి, రాంమ్మూర్తి, మహేష్, నాగన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

గార్ల: మహబూబాబాద్‌లో నేడు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన జనచైతన్య యాత్ర బహిరంగ సభకు హాజరుకావాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు ఆహ్వానపత్రికను సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కవిత, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: సభా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జయప్రదం చేయండి

దంతాలపల్లి: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నేడు మానుకోట జిల్లా కేంద్రంలో జరుగబోయే జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని మానుకోట సీపీఐఎం కార్యవర్గ సభ్యులు గునుగంటి మోహన్ గురువారం తెలిపారు.

తెరుచుకున్న సూపర్ బజార్

సాక్షి ఎఫెక్ట్..

గూడూరు: మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థ ద్వారా ఏర్పాటైన జీసీసీ మినీ సూపర్ బజార్ తెరుచుకుంది. మండల కేంద్రంలో 'అలంకార ప్రాయంగా జీసీసీ మినీ సూపర్ బజార్' అనే కథనం గురువారం ప్రచురితమైన విషయం తెలిసిందే. బుధవారం రెవెన్యూ శాఖకు చెందిన ఓ రేషన్ షాపు తనిఖీకి వెళ్లిన తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు లబ్ధిదారులు మూసి ఉంటున్న జీసీసీ మినీ సూపర్ బజార్ విషయాన్ని తెలిపారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ ఐటీడీఏ జీసీసీ అధికారులతో మాట్లాడి ఆ షాపుకు గతంలో నిర్వహణ కొనసాగించిన సారయ్యకు తిరిగి బాధ్యతలు అప్పగించినట్లు, ఈ నెలలో ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు అందించారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు

- ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్

నెల్లికుదురు: కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో గురువారం 10గ్రామాల కార్యకర్తలతో నిర్వహించిన బీఆర్‌ఎస్ కుటుంబ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు పథకాలను ప్రచారం చేసి పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



సమ్మె చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ ఐకేపీ వీఓఏ యూనియన్ ఆధ్వర్యంలో మూడు రోజుల టోకెన్ సమ్మె శిబిరాన్ని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రారంభించారు. ఈసందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణ పోరాటంలో అనునిత్యం సీపీఎం పాల్గొంటుందని, 17నుంచి జరుగనున్న జన చైతన్య యాత్రలో కార్మికుల డిమాండ్లు కూడా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సుధాకర్, నాగన్న, శోభారాణి, మౌనిక, కృష్ణవేణి, శ్రీలత, పురుషోత్తం పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటాలు

నెహ్రూసెంటర్: కార్మికుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హలావత్ లింగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్‌లో ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల రక్షణకు ఉద్యమిస్తూనే భవిష్యత్ పోరాటాలకు సిద్ధమయ్యేందుకు ఐఎఫ్‌టీయూ ప్రథమ జిల్లా మహాసభలను ఈనెల 19వ తేదీన జిల్లా కేంద్రంలోని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మిక, కర్షకులు, ప్రజలు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జబ్బార్, సయ్యద్, నిజాముద్దీన్, లక్ష్మయ్య, సురేష్, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

మహబూబాబాద్ అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం జిల్లా అథ్లెటిక్ ఎంపికలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అథ్లెటిక్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు అవకాశం వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాసనాగమణి, సభ్యులు దాక్షినాయక్, గాంధీ వీరన్న పాల్గొన్నారు.



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

'ఉపాధి' చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

మరిపెడ రూరల్: ఉపాధి హామీ పథకం చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనే కుట్ర చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న ఆరోపించారు. మండలంలోని ఆనెపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన సందర్శించాడు. అనంతరం ఉపాధి కూలీలతో కలిసి రాజన్న మాట్లాడుతూ.. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి రూ.30వేల కోట్లు తగ్గించి కూలీల నోట్లో మట్టి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రతీ కుటుంబానికి ఏడాదికి 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మార్చి 17న జిల్లా కేంద్రంలో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ, సుజాత, రాంలాల్, లాల్యా, రమేష్, కౌసల్య పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న రాజన్న

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కే పట్టం



ప్రచారం చేస్తున్న నాయకులు

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల కష్టాలు తీరుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా గురువారం మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో, శివారు తండాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాల తీరుతో ప్రజలు విసుగుచెందారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కడుతారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మానుకోట మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, సారయ్య, సతీష్, చందు, శ్రావణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



అధ్యక్ష, కార్యదర్శులు

గంగారం: కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా గురువారం ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడిగా జాడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ధనసరి కమలహాసన్, ఉపాధ్యక్షులుగా నాసం సాంబయ్య, బండి సుధాకర్, కోశాధికారిగా భూక్య బాలునాయక్, అధికార ప్రతినిధిగా ఈసం సురేష్, ప్రచార కార్యదర్శిగా సోలం బాబు, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా ఈసం నర్సక్క, గంగారం మండల యూత్ అధ్యక్షుడిగా ముడిగ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పుల్సం సురేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడిగా దనసరి సారయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా బానోత్ సేవాలాల్, ప్రధాన కార్యదర్శిగా ఈక లక్ష్మ ణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా దుర్గం లవయ్య, ప్రధాన కార్యదర్శిగా జనగాం కిష్టస్వామి, ఉపాధ్యక్షుడిగా ఈక సురేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

గ్రామ కమిటీ ఎన్నిక

కురవి: వచ్చే ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీదే గెలుపని మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం అన్నారు. గురువారం మండలంలోని తట్టుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కొత్త యాకన్న, గౌరవ అధ్యక్షుడిగా కొత్త జానయ్య, అంతటి రామచంద్రు, ఉపాధ్యక్షులుగా రామస్వామి, గఫార్, ప్రధాన కార్యదర్శిగా కుదురుపాక ఉప్పలయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా అంతటి యాదగిరి, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా ఐనాల భిక్షపతి, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా జంగం దావిద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా గుగులోతు మల్సూర్‌లను ఎన్నుకున్నట్లు వీరభద్రం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నేటినుంచి 'గ్రంథ సేకరణ'

మహబూబాబాద్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఈనెల 17వ తేదీ నుంచి గ్రంథ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, కార్యదర్శి శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మేధావులు, పుస్తక ప్రియులు, రచయితలు, కవులు, కళాకారులు, అభ్యుదయ వాదులు, పుస్తక విక్రేతలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యావంతులు తమ వద్ద ఉన్న పుస్తకాలు ర్యాక్‌లలో పరిమితం కాకుండా జిల్లాలో ఉన్న 14 గ్రంథాలయాలకు పుస్తకదానం చేసి బావితరాలకు ఉపయోగపడాలని కోరారు. గ్రంథాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా శ్రీమాన్



తొర్రూరు: జేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన పూసాల శ్రీమాన్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. గురువారం డివిజన్ కేంద్రంలో ఆయనను బీజేపీ రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య, అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, పార్టీ నాయకులు సత్కరించారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

దంతాలపల్లి: విద్యార్థుల జీవితాల్లో 10వ తరగతి కీలకమని నోడల్ ప్రధానోపాధ్యాయుడు బుధారపు శ్రీనువాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో పది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో నిర్వహించబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో పిల్లలు మంచి ఫలితాలు సాధించాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నెహ్రూసెంటర్: మున్నూరుకాపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు పుట్టం పురుషోత్తమరావు అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తమరావు మాట్లాడుతూ.. సంఘం మహిళల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చందాగోపి, జిల్లా ప్రధాన సలహాదారు శ్రీనివాస్, జిల్లా ప్రచార కార్యదర్శి, రమేష్, చంద్రశేఖర్, వేణు పాల్గొన్నారు.

సభ్యత్వం ఇప్పిస్తాం..

దంతాలపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ముదిరాజ్‌కు గ్రామ సొసైటీలో సభ్యత్వం ఇప్పిస్తామని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మానుకోట జిల్లా ప్రచార కార్యదర్శి దుండి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో కుమ్మరికుంట్ల గ్రామంలో గురువారం సొసైటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యులు రామకృష్ణ, సాలయ్య, ధర్మయ్య, యాకయ్య పాల్గొన్నారు.

విరాళం అందజేత

దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామంలో ఈనెల 19న మాదిగల కుల దైవమైన సవారులచ్చమ్మ (పెద్దమైసమ్మ) పండగా సందర్భంగా నర్సింహులపేట, దంతాలపల్లి ఉమ్మడి మండలాల సహకార సంఘం చైర్మన్ సంపెట రాము గురువారం రూ.15వేల విరాళం అందజేశాడు.

ఘనంగా ఆదినాథ్ భగవాన్ జయంతి



డోర్నకల్: జైన మతస్తులు గురువారం ఆదినాథ్ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు.

నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి

గార్ల: ప్రధాని నరేంద్రమోదీ, కేసీఆర్ నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని పీవైఎల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండారి ఐలయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చిన్నకిష్టాపురం గ్రామంలో జరిగిన పీవైఎల్ మండల నిర్మాణ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత గ్రామంలో బిగి పిడికిలి జెండా ఆవిష్కరించి అమరవీరులకు సంతాపం తెలిపారు. సమావేశంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి సీహెచ్ గణేష్, ఎన్‌డీ మండల కార్యదర్శి సక్రు, మంగీలాల్, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



పెద్దవంగర: మండలంలోని రామచంద్రు తండా ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిట్యాల కాంప్లెక్స్ హెచ్‌ఎం మడిపెద్ది వెంకన్న, హెచ్‌ఎం చిక్యాల సతీష్, ఉపాధ్యాయులు గుర్రం శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగయ్య మృతి పార్టీకి తీరనిలోటు

బయ్యారం: మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన ఎన్డీ నాయకులు వజ్జ మంగపతి మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. గురువారం మంగపతి మృతదేహం వద్ద నివాళులర్పించారు. నాయకులు భిక్షం, పొమ్మయ్య, లింగయ్య, రాంబాబు, అచ్చయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని జంగిలిగొండ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం సర్పంచ్ పంజాల సాయిలు ప్రారంభించాడు. కార్యక్రమంలో కార్యదర్శి గవిని మహేష్, ఎఫ్ఏ కొమ్మురాజుల ఉమారాణి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొమురెల్లి, రైతు కోఆర్డినేటర్ శ్రీనివాసు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన

పెద్దవంగర: మిర్చిలో శనిగపచ్చ పురుగు ఆశించి మొగ్గలను పూతలను పూత పిందే, లేత ఆకులను తినేయడం జరుగుతుందని, కట్టడికి సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ కాటమరాజు తెలిపారు. మండలంలోని గంట్లకుంట గ్రామంలో ఓ రైతు సాగు చేసిన మిర్చి పంటను గురువారం పరిశీలించాడు.

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: వారంరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈనెల 10వ తేదీన ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కర్నె బాబు(48) ఆటోలో మద్యం బాటిళ్లను గ్రామాల్లోని బెల్టు దుకాణాలకు సరఫరా చేస్తుండగా ఆటో బోల్తా పడింది. తీవ్ర గాయాలపాలైన బాబు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు డోర్నకల్ ఎస్సై రవికుమార్ తెలిపారు.

కుక్కల దాడిలో దూడ మృతి

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన ఎస్‌కె సైదులు పశువులను ఇంటి ముందు కట్టేసి నిద్రించగా అర్ధరాత్రి కుక్కలు దూడపై దాడి చేసి చంపేశాయి.

అనారోగ్యంతో పోస్టల్ ఉద్యోగి మృతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన, పోస్టల్ శాఖలో ఈడీఎంసీ విభాగంలో పనిచేస్తున్న తాళ్లూరి సారంగపాణి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు మృతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుంకు నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు.

ఆవును అపహరించిన వ్యక్తుల అరెస్టు

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామంలో ఓ రైతుకు చెందిన ఆవును అపహరించిన ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోతి శ్రీనివాస్ అనేరైతు తన ఆవును ఈనెల 10న పొలం వద్ద కట్టేయగా, రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా ఇంటికన్నె గ్రామానికి చెందిన అంగడి అనిల్, పుట్టబంతి వీరన్నలు కలిసి, కేసముద్రంస్టేషన్‌లోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఆవుతో అనుమానస్పదంగా కనిపించారు. వారిద్దరిని విచారించగా, తామే ఆవును అపహరించామని ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి, ఆవును రైతుకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ వ్యాపారులకు జైలు శిక్ష తప్పదు



గూడూరు: నిబంధనలు ఉల్లంఘిస్తూ పలుమార్లు అక్రమ వ్యాపారాలు చేస్తూ పట్టుబడే వ్యక్తులకు జైలు శిక్షతప్పదని ఎక్సైజ్ సీఐ ఎస్.భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలోని శాఖ కార్యాలయంలో గురువారం ఆయన కేసముద్రం మండలంలో అక్రమ వ్యాపారాలకు పాల్పడుతూ పట్టుబడ్డ గిర్నితండాకు చెందిన బానోతు క్రిష్ణకు తహసీల్దార్ ఫరీదుద్దీన్ విధించిన రూ.లక్ష జరిమానా చెక్కును సీఐ తీసుకున్నారు. మరోసారి అక్రమ వ్యాపారం చేస్తూ పట్టుబడితే తప్పనిసరిగా జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా అక్రమ వ్యాపారాలు మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, సుధాకర్, యుగంధర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మరిపెడ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో సంపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందని నీలికుర్తి సర్పంచ్ గుడిపూడి శ్రీనివాసరావు అన్నారు. మరిపెడ మండలం నీలికుర్తి, ఎల్లంపేట, స్టేజితండా సెక్టార్లలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023, మహిళ, శిశుమాసోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగులోతు భాస్కర్, ఉపసర్పంచ్ గుగులోతు సురేష్, కార్యదర్శి రవి, టీచర్లు అరుణ, శిరీష, కనకమ్మ, ఉమా, ఏఎన్‌ఎం కీర్తి, ఆశవర్కర్లు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.